TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 305 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ ఆదివారం.31.05.2026 పేజీలు : 8, వెల:రూ.2.00


PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## మహాలక్ష్మి పథకంలో మార్పులు.. ఆధార్ బదులు స్మార్ట్ కార్డు తప్పనిసరి!




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న మహాలక్ష్మి పథకంలో మార్పులు రానున్నాయి. రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2 తర్వాత ఆర్టీసీ బస్సుల్లో ఆధార్ కార్డు పనిచేయదు. దీనికి ప్రత్యామ్నాయంగా మహిళలందరికీ స్మార్ట్ కార్డులు పంపిణీ చేయనుంది తెలంగాణ ఆర్టీసీ. లబ్ధిదారుల పేర్లు, అడ్రస్, ఐడీ నెంబర్లతో చిప్ బేస్డ్ టెక్నాలజీతో తయారు చేసిన స్మార్ట్ కార్డులను అందించనుంది. దీని ప్రకారం ఇకపై స్మార్ట్ కార్డు ఉంటేనే బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఉంటుంది. ఈ స్మార్ట్ కార్డులు అందేంత వరకు పాత పద్ధతిలోనే మహిళలు ప్రయాణించవచ్చని అధికారులు స్పష్టం చేశారు.

## ఆసియా క్రీడల ట్రయల్స్‌లో వినేశ్ ఫొగాట్‌కు నిరాశ..




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: భారత స్టార్ రెజ్లర్, జులనా ఎమ్మెల్యే వినేశ్ ఫొగాట్‌కు ఆసియా క్రీడల ఎంపిక ట్రయల్స్‌లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సుదీర్ఘ విరామం తర్వాత కోర్టు ఆదేశాలతో బరిలోకి దిగిన ఆమె, శనివారం న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన మహిళల53 కేజీల విభాగం సెమీఫైనల్లో పరాజయం పాలయ్యారు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో ఆసియా రజత పతక విజేత మీనాక్షి గోయట్ చేతిలో 4-6 తేడాతో వినేశ్ ఓడిపోయారు. దీంతో ఈ ఏడాది జపాన్‌లో జరగనున్న ఆసియా క్రీడలకుఅర్హత సాధించే అవకాశాన్ని ఆమె కోల్పోయారు.

## మహిళలు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి చేరాలి

బంజారాహిల్స్ : అమృత్ తెలంగాణ: మహిళలు ఉద్యోగం వెతికే స్థాయి నుంచి ఉద్యోగం ఇచ్చే స్థాయికి ఎదగాలని, గ్రామీణ మహిళల ప్రతిభ, ఆలోచనలు, వ్యాపార కలలకు బలమైన వేదికగా ఇంక్యుబేటర్ కేంద్రాలు నిలుస్తాయని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. మహిళల చేతుల్లో బ్యాంక్ పాస్‌బుక్స్ మాత్రమే కాకుండా పరిశ్రమలు, వ్యాపారాలు ఉండాలని ప్రభుత్వం సంకల్పంతో పనిచేస్తోందని తెలిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కొమరంభీం ఆదివాసీ భవన్‌లో మహిళా పారిశ్రామికవేత్తలకు ఆర్థిక, సాంకేతిక, వ్యాపారపరమైన సహకారం అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఇంక్యుబేటర్ కేంద్రాలను శుక్రవారం మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. "మేడ్ ఇన్ తెలంగాణ.. మేడ్ బై ఉమెన్" అనే నినాదం ప్రపంచవ్యాప్తంగా మారుమోగాలని ఆకాంక్షించారు. దేశంలోని అగ్రశ్రేణి ఇన్నోవేషన్ ప్లాట్‌ఫామ్ టీ హబ్‌తోపాటు బిట్స్ పిలానీ భాగస్వామ్యంతో రెండు ప్రత్యేక ఇంక్యుబేటర్లను ఏర్పాటు చేస్తున్నట్టు



వెల్లడించారు. ప్రతి ఇంక్యుబేటర్‌కూ రూ.10.70 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు ట్రైనింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్, డిజిటల్ సపోర్ట్, ఫైనాన్షియల్ గైడెన్స్, బిజినెస్ మెంటారింగ్ వంటి సేవలు అందించనున్నట్టు చెప్పారు. తొలి దశలో 300 మంది మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు.

తెలంగాణలో ప్రస్తుతం 67 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలు ఉన్నారని, వారు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలుగా నిలుస్తున్నారని మంత్రి అన్నారు. వారి వ్యాపారాల విస్తరణ కోసం ప్రత్యేక ఎస్‌హెచ్‌జీ యాప్‌ను అభివృద్ధి చేశామని తెలిపారు. మహిళా సంఘాలు 100 శాతం రీపేమెంట్ చేసి దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. మేడారం జాతర సందర్భంగా మహిళలు భారీ స్థాయిలో వ్యాపారం నిర్వహించి తమ సామర్థ్యాన్ని నిరూపించుకున్నారని చెప్పారు.

గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. చేర్యాల మహిళలు తయారు చేసిన చింతగింజల మాస్కులు నెదర్లాండ్స్ వరకు ఎగుమతి కావడం తెలంగాణ మహిళల సృజనాత్మకతకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈఆర్‌పీ సీఈఓ దివ్య దేవరాజన్, వీ-హబ్ సీఈఓ సీత పల్లచోల, టీ హబ్ సీఈఓ కవికృత్, ఎస్‌ఈఆర్‌పీ నాన్‌ఫామ్ డైరెక్టర్ జాన్సన్, డీఆర్‌డీఓ ప్రతినిధులు, జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, యువ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## త్వరలో పీఎఫ్ ఖాతాదారులకు వాట్సప్ సేవలు ప్రారంభం




హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ త్వరలో వాట్సప్ ద్వారా ఖాతాదారులకు సేవలను అందుబాటులోకి తీసుకురానుంది. దీని ద్వారా పీఎఫ్ బ్యాలెన్స్ చెకింగ్, క్లెయిమ్ స్టేటస్, కేవైసీ అప్డేట్, ఫిర్యాదులు వంటి సేవలను సులువుగా పొందవచ్చు. యూఏఎన్ నెంబర్‌తో లింక్ అయిన మొబైల్ నుంచి నిర్దిష్ట నెంబర్‌కు 'హాయ్' అని మెస్సేజ్ చేస్తే చాలు. ఈ సేవలు వివిధ ప్రాంతీయ

భాషల్లోనూ అందుబాటులో ఉంటాయి. దీనివల్ల పీఎఫ్ కార్యాలయాలపై ఒత్తిడి తగ్గి, ఫిర్యాదుల పరిష్కారం వేగవంతం అవుతుందని భావిస్తున్నారు. ఈ చాట్‌బాట్ 24 గంటలూ అందుబాటులో ఉంటుంది.

## కరెంటు కోత పెట్టేందుకే ఈ నాటకాలు

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రైతులకు మూడు గంటల కరెంటు చాలు అని సీఎం రేవంత్‌రెడ్డి మనసులోని మాటను ఈఆర్సీ ముందు రైతు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి బయటపెట్టారని బీఆర్‌ఎస్ ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు డిస్కం పేరిట 24 గంటల కరెంట్ కు కోత పెట్టేందుకేనా ఈ నాటకాలు అని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతాంగం బుద్ధి చెబుతుందని పేర్కొన్నారు. అది కోదండ రెడ్డి వ్యక్తిగత అభిప్రాయం కాదనీ, రేవంత్ రెడ్డి మనసులోని ఆలోచన అని తెలిపారు. అమెరికా వేదికగా రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను ఇప్పుడు అమలు చేసే దిశగా కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. పొలం అంటే ఏంటో బోరు ఆగిపోతే పంట ఎలా ఎండిపోతుందో రైతు రాత్రింబవళ్లు ఎలా కష్టపడతాడో తెలియని వాళ్లు మాత్రమే మూడు గంటల కరెంట్ చాలని మాట్లాడగలరని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుకు 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంట్ ఇచ్చి వ్యవసా యాన్ని దేశానికి ఆదర్శంగా నిలబెట్టిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అదే రైతును మళ్లీ చీకట్లలోకి నెట్టే ప్రయత్నం చేస్తోందని తెలిపారు. పంట కొనుగోళ్లు చేయక రైతుల ప్రాణం తీస్తున్నారని విమర్శించారు. 24 గంటల కరెంట్ ను ప్రణాళిక ప్రకారం ఖతం పట్టిస్తున్నారని పేర్కొన్నారు. రైతు డిస్కం వెనుక దాగి ఉన్న కాంగ్రెస్ అసలు కుట్ర ఇదేనా?అని ప్రశ్నించారు. కరెంట్ కోతలతో, రైతులకు వాతలు పెట్టాలని చూస్తున్న రేవంత్ రెడ్డి కుట్రలను తెలంగాణ రైతాంగం గమనిస్తోందని తెలిపారు. రైతు వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పే రోజు దగ్గర్లోనే ఉందని హెచ్చరించారు. ధాన్యం కొనుగోళ్ల టార్గెట్ తగ్గించడంపై ?హరీశ్‌రావు ఆగ్రహం ధాన్యం కొనుగోళ్ల లక్ష్యాన్ని 90 లక్షల మెట్రిక్ టన్నుల



నుంచి 75 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గించడంపై మాజీమంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరికొన్ని రోజుల్లో ఏకంగా "కొనుగోళ్లు పూర్తయ్యాయి" అని ప్రకటిస్తారేమోనని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు 1.41 కోట్ల మెట్రిక్ టన్నుల పంట పండిందని గొప్పలు చెప్తూ మరోవైపు కొనుగోలు మాత్రం 75 లక్షల మెట్రిక్ టన్నులకే పరిమితం అంటారా?అని ప్రశ్నించారు. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామటూనే ప్రభుత్వం పెట్టుకున్న టార్గెట్ ను తగ్గించడం రైతులను మోసం చేయడం కాదా?అని అడిగారు. వరి కుప్పల వద్ద రైతులు ప్రాణాలు కోల్పోయింది అబద్ధమా?అని ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి రైతులు పడిగాపులు కాచింది అబద్ధమా?అని అడిగారు.

## తెలంగాణ ఎడ్‌సెట్-2026 ఫలితాలు విడుదల



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తెలంగాణ రాష్ట్రంలో బీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన 'తెలంగాణ ఎడ్‌సెట్-2026' పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా మే 12న జరిగిన ఈ పరీక్షకు సంబంధించి ఇప్పటికే కీ విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించిన అధికారులు తాజాగా ఫలితాలు వెల్లడించారు.

## ఉద్యోగుల సుదీర్ఘకాల బకాయిలు విడుదల

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని రాష్ట్ర ప్రభుత్వం మరోసారి నిరూపించుకుంది. ఉద్యోగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది. వారి సుదీర్ఘకాల బకాయిలు రూ. ఆరు వేల కోట్లను కేవలం వంద రోజుల్లో విడుదల చేస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉద్యోగ జేఏసీ నాయకులకు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ?ఈ హామీని నెరవేర్చే దిశగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా శుక్రవారం తొలి విడతలో రూ.రెండు వేల కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి కీలకమైన బకాయిలను ప్రభుత్వం పూర్తిగా చెల్లించిందని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) బకాయిల మొత్తాన్ని వంద శాతం మంజూరు చేశామని వివరించారు. ఈ ఉద్యోగులకు సంబంధించి గతేడాది మే వరకు పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలన్నింటినీ చెల్లించినట్టు తెలిపారు. "ముందస్తు ప్రణాళికలు, పక్కా కార్యాచరణతోనే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు.

# నిర్మల్ జిల్లా బిఎస్పీ జిల్లా కార్యదర్శిగా చెరుకు రాజ్యం




నిర్మల్ జిల్లా బీఎస్పీ జిల్లా కార్యదర్శిగా నియామకమైన చెరుకు రాజ్యం

నిర్మల్ జిల్లా మే 30 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా .చెరుకు రాజ్యం ను నియమించినట్లు నిర్మల్ జిల్లా బిఎస్పి అధ్యక్షులు జగన్ మోహన్ తెలిపారు గతంలో ముదోల్ నియోజకవర్గం పార్టీ అద్యక్షులుగా పని చేసిన చెరుకు రాజ్యం ఇప్పుడు జిల్లా కార్యదర్శిగా నియామకం కావడంతో సంతోషంగా ఉందని తెలిపారు పార్టీ అప్పగించిన బాధ్యతలను నెరవేరుస్తూ నిరంతరం పేదల పక్షాన వారికి అండగా ఉంటానని ఏ సమస్య పైన అయినా వారి తరఫున పోరాడుతానని తెలిపారు




నిర్మల్ జిల్లా బీఎస్పీ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా చెరుకు రాజ్యం ను ఘనంగా సన్మానిస్తున్న పార్టీ నాయకులు

# ‘అమ్మ మాట - అంగన్‌వాడీ బాట’ను విజయవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారుల సమగ్ర ఆరోగ్యం, పోషణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన “అమ్మ మాట – అంగన్‌వాడీ బాట’’ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. శనివారం స్థానిక రిక్షా కాలనీ నందు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన “అమ్మ మాట – అంగన్‌వాడీ బాట” కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లభించే విభిన్న సేవలను గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు మన పిల్లల ప్రగతికి పునాది అని, చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు, తల్లుల సంరక్షణకు జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. “అమ్మ మాట – అంగన్‌వాడీ బాట” పథకం ద్వారా లబ్ధిదారులకు అందుతున్న సేవల ప్రాధాన్యతను వివరించారు. గర్భిణీ స్త్రీలకు గర్భధారణ సమయం నుండి తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన సంపూర్ణ పౌష్టికాహారాన్ని, బలాన్నిచ్చే ఆహార పదార్థాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లోపం లేకుండా అందించాలని పేర్కొన్నారు. అలాగే, ప్రసవానంతరం తల్లులు త్వరగా కోలుకోవడానికి, శిశువుకు అవసరమైన తల్లిపాలు సక్రమంగా అందేలా బాలింతలకు అవసరమైన ప్రత్యేక ఆరోగ్య సేవలను, పోషకాహారాన్ని సమకూర్చడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. మరోవైపు, 6 నెలల వయస్సు నుండి 6 సంవత్సరాల లోపు ఉన్న చిన్న పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడేలా రుచికరమైన, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ప్రతిరోజూ నిబంధనల ప్రకారం పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. చిన్నారులలో విద్యా పునాది బలంగా ఉండాలని, అందుకు అంగన్‌వాడీ కేంద్రాలలో ఆటపాటలతో కూడిన నాణ్యమైన ప్రీ-స్కూల్ (పూర్వ ప్రాథమిక) విద్యను పక్కాగా అమలు చేయాలన్నారు. వీటితో పాటు, చిన్నారులను ప్రాణాంతక వ్యాధుల నుండి రక్షించడానికి సకాలంలో వేయాల్సిన అన్ని రకాల టీకాలను (ఇమ్యునైజేషన్), క్రమబద్ధమైన ఆరోగ్య పరీక్షలను వైద్య శాఖ సమన్వయంతో ఉచితంగా నిర్వహించాలని సూచించారు. బాలల సమగ్ర అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు ఒక బలమైన పునాదిగా పనిచేస్తూ, ఆరోగ్యకరమైన బాల్యానికి బాటలు వేయాలని ఆకాంక్షించారు. ‘తెలంగాణ రైజింగ్’ సంకల్పంలో భాగంగా సాగుతున్న ఈ సేవలలో ఏవైనా లోపాలున్నా, లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైనా ప్రభుత్వ ఉచిత చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్: 1098 ను (24 గంటలు) సంప్రదించవచ్చని తెలియజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు కలెక్టర్ చేతుల మీదుగా అంగవాడి యూనిఫారం లను, ‘విద్యా ఆరంభ సర్టిఫికెట్లను’ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా, వార్డ్ కౌన్సిలర్ స్వాతి మంగేష్ దేవతలే, స్థానిక అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, పోషకులు, చిన్నారులు పాల్గొన్నారు.




సర్టిఫికెట్ అందజేస్తున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

# ధాన్యం అన్‌లోడింగ్‌ను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

## సాత్ గావ్, నగర్ గ్రామాల్లోని రైస్ మిల్లుల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

## ఆధునిక యంత్రాల వినియోగంపై యాజమాన్యాలకు సూచనలు

## అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశం



రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



నిర్మల్ జిల్లా మే 30 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా లో ధాన్యం కొనుగోలు, అన్‌లోడింగ్ ప్రక్రియను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఎక్కడా జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. శనివారం లోకేశ్వరం మండలంలోని సాత్ గావ్, నగర్ గ్రామాల్లో ఉన్న రైస్ మిల్లులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను సమీక్షించారు. సాత్ గావ్ గ్రామంలోని శ్రీదుర్గా రైస్ మిల్లును సందర్శించిన కలెక్టర్, అక్కడ యంత్రాల సహాయంతో జరుగుతున్న ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక యంత్రాల వినియోగం ద్వారా తక్కువ సమయంలో, తక్కువ మంది హమాలీలతో అధిక పరిమాణంలో ధాన్యం సంచులను అన్‌లోడ్ చేయవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని ఇతర రైస్ మిల్లుల యాజమాన్యాలు కూడా ఇటువంటి అధునాతన యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తనిఖీల సందర్భంగా మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల సంఖ్య, మిల్లుల నిల్వ సామర్థ్యం, ఇప్పటివరకు అన్‌లోడ్ చేసిన ధాన్యం పరిమాణం, ప్రస్తుతం పనిచేస్తున్న హమాలీల సంఖ్య తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. లారీల ద్వారా వచ్చే ధాన్యాన్ని వెంటవెంటనే అన్‌లోడ్ చేస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం నగర్ గ్రామంలోని రైస్ మిల్లును సందర్శించిన కలెక్టర్, ధాన్యం నిల్వకు అవసరమైన ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. తగిన సంఖ్యలో హమాలీలను అందుబాటులో ఉంచి అన్‌లోడింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, లోకేశ్వరం తహసిల్దార్ సూర్యారావు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ భవేశ మిశ్రా



నిర్మల్ జిల్లా మే 30 అమృత్ తెలంగాణ నిర్మల్ కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. పోలీసు సిబ్బంది నిరంతరం సీసీ కెమెరాలు పర్యవేక్షణతో మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. సిబ్బంది పటిష్ట అగ్నిమాపక వ్యవస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అధికారులు రాజశ్రీ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎం గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

# ఇబ్రహీంపట్నం, గోధూర్ లో అమ్మ మాట అంగన్వాడి బాట



గోధూర్ అమ్మ మాట అంగన్వాడి బాట లో పాల్గొన్న అంగన్వాడి టీచర్లు, ఈశ్వరి ,భాగ్యవతి

ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ: మే 30 జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈరోజు గోధూర్, ఇబ్రహీంపట్నం మండలంలో సిడిపిఓ మనమ్మ ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమము నిర్వహించడం జరిగింది .బడి ఈడు పిల్లలను బడిలో చేర్చుకోవడం, అదేవిధంగా విద్యారంభ సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగింది .మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రైవేట్ , పట్టణాల ,స్కూలుకు పంపకుండా అంగన్వాడికే పంపాలని తల్లిదండ్రుల కుఅవగాహన ఇవ్వడం జరిగింది పట్టణాలకు నర్సరీ ఎల్కేజీ యూకేజీ పంపడం వల్ల బస్సు ప్రయాణంలో పిల్లలు శారీరకంగా మానసికంగా అలిసిపోతారు మన దగ్గర అంగన్వాడీలలో అన్ని వసతులతో విద్య నేర్పిస్తారు ,ప్రైవేటు వద్దు అంగన్వాడీ ముద్దు అనే నినాదంతో బడిబాట కార్యక్రమం నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమానికి సిడిపిఓ మనమ్మ అంగన్వాడీ సూపర్వైజర్ శోభారాణి అంగన్వాడీ టీచర్లు మరియు తల్లులు పాల్గొనడం జరిగింది




అమ్మ మాట అంగన్వాడి బాట లో పాల్గొన్న సిడిపిఓ మనమ్మ సూపర్వైజర్ శోభారాణి, అంగన్వాడీ టీచర్లు

# వరి ధాన్యం ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలి : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ మే 30, 2026: రైతు సంక్షేమంలో ప్రభుత్వం చేపట్టిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను నిబంధనల ప్రకారం సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎ సి సి ప్రాంతంలో గల హనుమాన్ రైస్ మిల్లును సందర్శించి ధాన్యం దిగుమతి, నిల్వ ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దాన్యం నిల్వ, తరలింపులో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశిత సమయానికి అనుగుణంగా ధాన్యం ప్రక్రియను వేగవంతం చేయాలని, లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. మందమర్రి మండల కేంద్రంలోని శ్రీ వాసవి, అంబికా సాయి, సప్తగిరి రైస్ మిల్లులతో పాటు సారంగపల్లి, పొన్నారం గ్రామాలలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల తహసిల్దార్ సతీష్ కుమార్ తో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు, నిల్వ, ధాన్యం దిగుమతి, సి ఎం ఆర్ ప్రక్రియలను పరిశీలించారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, కొనుగోలు ప్రక్రియను ఎలాంటి అవాంతరాలు లేకుండా పారదర్శకంగా, వేగంగా నిర్వహించాలని తెలిపారు. ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని గోదాములలో నిల్వ చేయాలని తెలిపారు. కొనుగోలు చేసి తరలించిన మొక్కజొన్నలను సైతం గోదాములలో నిలువ చేయాలని తెలిపారు. అనంతరం నస్పూర్ మండలంలో గల స్టేట్ వేర్ హౌస్ కార్పొరేషన్ గోదామును మండల తహసిల్దార్ సంతోష్ కుమార్ తో కలిసి సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భువనగిరి లో చలకాని వెంకన్న యాదవ్ కు ఘనంగా విజయోత్సవ సన్మానం

అమృత్ తెలంగాణ : తెలంగాణ యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు చలకాని వెంకన్న యాదవ్ కు శనివారం భువనగిరి లోని ఉద్యోగుల విశ్రాంతి భవనం లో ఘనంగా విజయోత్సవ సన్మానం నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా విద్యావంతుల వేదిక అధ్యక్షులు కొత్తపల్లి ఆనంద్ యాదవ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ రాష్ట్ర పోలీస్ కాంప్లేంట్ అథారిటీ సభ్యులు డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యావంతుల వేదిక బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులుగా గతంలో కొందరికే పరిమితం అయ్యేది. కానీ అందరికీ అవకాశం రావాలని చలకాని వెంకన్న యాదవ్ పోటీ చేసి గెలుపొందడం చాలా గొప్ప విషయం అని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదవ విద్యావంతుల వేదిక నాయకులు, తోటకూర యాదయ్య యాదవ్ , గుండె బోయిన అయోధ్య యాదవ్, సింగన బోయిన మల్లేశం యాదవ్, శెట్టి బాలయ్య యాదవ్, నరాల వెంకట స్వామి యాదవ్, మంటిపల్లి సతీష్ యాదవ్, పాక జహంగీర్ యాదవ్, వేల్పుల వెంకటేష్ యాదవ్, యాదవ కుల సంఘాల నాయకులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోళ్లలో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిర్మల్ జిల్లా వరి కొనుగోళ్లు కూడా వేగవంతం

## ప్రతి గింజను కొనుగోలు చేస్తాం - రైతులు ఆందోళన చెందవద్దు : జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా





ధాన్యం కొనుగోళ్లపై మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

నిర్మల్ జిల్లా మే 30 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా లో యాసంగి సీజన్‌కు సంబంధించిన మక్కలు, వరి, జొన్నల కొనుగోళ్లు రవాణా ప్రక్రియలు వేగవంతంగా కొనసాగుతున్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మొక్కజొన్న, వరి, జొన్నల కొనుగోలు ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని అన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

మక్కల కొనుగోళ్లలో రికార్డు

మే 31 నాటికి 1.10 లక్షల మెట్రిక్ టన్నుల మక్కలను కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.2,400 ఉండటంతో రైతులు పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలకు పంటను తీసుకువచ్చారని తెలిపారు. బహిరంగ మార్కెట్లో క్వింటాలుకు రూ.1,700--1,800 మాత్రమే లభిస్తుండగా, ప్రభుత్వ కొనుగోళ్ల ద్వారా రైతులకు అధిక లాభం చేకూరిందన్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు కేంద్రాలకు వచ్చిన ప్రతి గింజను కొనుగోలు చేయడం ద్వారా మే 30 నాటికే 1.61 లక్షల మెట్రిక్ టన్నుల మక్కల కొనుగోలు పూర్తిచేసి రాష్ట్రంలోనే నిర్మల్ జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని కలెక్టర్ పేర్కొన్నారు.

మక్కల రవాణా శరవేగం

ఇప్పటివరకు 1.34 లక్షల మెట్రిక్ టన్నుల మక్కలను గోదాములకు తరలించగా, సుమారు 30 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కేంద్రాల్లో మిగిలి ఉన్నాయని తెలిపారు. రోజుకు 5 నుంచి 6 వేల మెట్రిక్ టన్నుల చొప్పున రవాణా కొనసాగుతోందని, జూన్ 2 నాటికి ఈ ప్రక్రియ పూర్తవుతుందని వెల్లడించారు. వర్షాల నేపథ్యంలో మక్కలు తడిసి మొలకెత్తే ప్రమాదం ఉన్నందున వరి కంటే మక్కల రవాణాకే ప్రాధాన్యత ఇస్తున్నామని, ఒక్క కిలో కూడా నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

వరి కొనుగోళ్లు ముమ్మరం

జిల్లాలో 1.80 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 1.08 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. గతేడాది కూడా ఇదే స్థాయిలో కొనుగోళ్లు జరిగాయని గుర్తు చేశారు. ఇప్పటివరకు 80 నుంచి 85 వేల మెట్రిక్ టన్నుల వరిని గోదాములకు తరలించామని, ప్రస్తుతం రోజుకు 6 నుంచి 7 వేల మెట్రిక్ టన్నుల వరి రవాణా జరుగుతోందన్నారు. మక్కల రవాణా పూర్తయిన తర్వాత అదనపు లారీలు, హమాలీలను వరి రవాణాకు వినియోగించి రోజువారీ సామర్థ్యాన్ని 9 వేల మెట్రిక్ టన్నుల వరకు పెంచుతామని తెలిపారు.

వర్షాలపై ముందస్తు చర్యలు

రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. రోడ్లపై, లోతట్టు ప్రాంతాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని గుర్తించి రక్షణ చర్యలు చేపట్టామని, ఇప్పటివరకు ఒక్క బస్తా ధాన్యం కూడా తడవలేదని చెప్పారు. ఒకవేళ భారీ వర్షాలు కురిసినా ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని స్పష్టం చేశారు.

జొన్నల కొనుగోళ్లకు సన్నద్ధం

జిల్లాలో జొన్నల కొనుగోలు కోసం 13 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మక్కల కొనుగోళ్లు పూర్తయిన వెంటనే జొన్నల కొనుగోళ్లను ముమ్మరం చేయనున్నట్లు చెప్పారు. క్వింటాలుకు రూ.3,700 మద్దతు ధరతో మార్క్‌ఫెడ్ ద్వారా 35 వేల నుంచి 40 వేల మెట్రిక్ టన్నుల జొన్నల కొనుగోళ్లు చేపట్టనున్నట్లు వెల్లడించారు. జొన్నల నిల్వ కోసం ఇప్పటికే 20 నుంచి 25 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములను సిద్ధం చేశామని, జూన్ 10 లేదా 11 నాటికి కొనుగోళ్లు, రవాణా పూర్తవుతాయని తెలిపారు.

గోదాముల సామర్థ్యం పెంపు

భారీ స్థాయిలో పంట కొనుగోళ్లు జరుగుతున్న నేపథ్యంలో గోదాముల కొరత తలెత్తకుండా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 1.90 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. లోకేశ్వరం, కడెం మండలాల్లో అదనపు గోదాములను గుర్తించి వినియోగంలోకి తీసుకువచ్చామని, రైతుల పంట భద్రతకు పూర్తి స్థాయిలో చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, మార్క్‌ఫెడ్ డీఎం మహేష్, డిపిఆర్‌ఓ విష్ణువర్ధన్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా





అధికారులకు వివరిస్తున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

నిర్మల్ జిల్లా మే 30 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా లో జూన్ 2న నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా, విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలెక్టరేట్ ప్రాంగణంలో జరిగే వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వేదికను పూలతో ఆకర్షణీయంగా అలంకరించాలని, వేడుకల ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర అవతరణ వేడుకలకు ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులను ఆహ్వానించాలని తెలిపారు. వేడుకలకు హాజరయ్యే అతిథుల కోసం తగిన సీటింగ్, తాగునీటి సౌకర్యం, సౌండ్ సిస్టమ్, షామియానా తదితర ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా స్టాళ్లను ఏర్పాటు చేయాలని, పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున ఉదయం నిర్ణీత సమయానికి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, హౌసింగ్ పీడీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్, హార్టికల్చర్ అధికారి రమణ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాలిపోయిన పామాయిల్ తోటను పరిశీలించిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి





జగిత్యాల రూరల్ అమృత్ తెలంగాణ మే 30: జగిత్యాల మండలం తిమ్మాపూర్ గ్రామంలో పామాయిల్ తోట అగ్ని ప్రమాదానికి గురి కావడంతో కాలిపోయిన పామాయిల్ తోటను పరిశీలించారు. మాజీ మంత్రి బీ ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి.జీవన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆలోచన మేరకే రైతులు పామాయిల్ తోటలకు మళ్లింపు జరుగుతుంది నష్టపోయిన పామాయిల్ తోట రైతులను ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిది అగ్ని ప్రమాదానికి కాలిపోయిన పామాయిల్ తోటకు రైతు అరే ధర్మన్నకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి ఆరుతడి పంటలు ప్రోత్సహించాలని భావనతోని పప్పు దినుసులు కానీ నూనె గింజలు కానీ మొక్కజొన్న జొన్న దీర్ఘకాలిక పంట అయినప్పటికీ పామాయిల్ తోట పైన ఎక్కువ దృష్టి సారించడం జరుగుతుంది పామాయిల్ మొక్క నాటిన తదుపరి నాలుగు సంవత్సరాలకు వరకు ఖాత ఆరంభం కాదు రైతు నాలుగు సంవత్సరాలు ఏదైనా ఇంటర్నల్ క్రాప్ తప్ప నాలుగు సంవత్సరాల వరకు పామాయిల్ తోటి ఏ విధమైన ఆదాయం పొందే అవకాశం లేదు.రైతును ఆదుకోవాలి.

# ఆదిలాబాద్‌లో 'అమ్మ మాట - అంగన్‌వాడీ బాట' కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఆదిలాబాద్ జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'అమ్మ మాట – అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గారితో కలిసి ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ బోరంచు శ్రీకాంత్ రెడ్డి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి గారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, చిన్నారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. మాతాశిశు ఆరోగ్య రక్షణ, గర్భిణీలకు మరియు చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర ఎంతో కీలకమని గుర్తుచేశారు. "మన అంగన్‌వాడీ – మన పిల్లల బంగారు భవిష్యత్తు" అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రజలందరూ అంగన్‌వాడీ సేవలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బాటలు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే, ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులలో ప్రజాస్వామ్య విలువలు, చట్టసభల



పనితీరుపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా నిర్వహించిన 'మాక్ పార్లమెంట్' అందరినీ ఆకట్టుకుంది. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్ఫీ పాయింట్ వద్ద కలెక్టర్ గారు మరియు ఇతర అధికారులతో కలిసి శ్రీకాంత్ రెడ్డి ఫోటోలు దిగారు.

# రైతులకు న్యాయం జరగకపోతే రోడ్డెక్కుతాం - ఎమ్మెల్యే అనిల్ జాదవ్


**బువ్వ పెట్టి - భుజం తట్టి**

**రైతులతో భోజనం చేస్తూ - సమస్యలు తెలుసుకుంటూ**

**కరోనా లాంటి కష్ట కాలంలో కూడా రైతుల కల్లాల్లో కాంటా పెట్టి పంట కొనుగోలు చేసిన ఘనత కెసిఆర్ ది**

**లోడింగ్ ఇబ్బందులు, గన్ని సంచుల కొరతకు పరిష్కారం చూపాలి**

**రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుంది**



అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ భీంపూర్ మండల కేంద్రంలో ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా జొన్న పంటలు తడిసి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కలిశారు. మండల కేంద్రంలో గల జొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, వర్షాల కారణంగా తడిసిపోయిన జొన్నలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులతో భోజనం చేసి సమస్యలు తెలుసుకున్నారు. అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని రైతులు ఆందోళన చెందుతున్న సమయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ, రైతులు ఎంతో కష్టపడి పండించిన జొన్నలు కొనుగోలు కేంద్రాల వద్ద లోడింగ్ అవ్వక, అకాల వర్షానికి తడవడం బాధాకరమన్నారు. రైతుల పంటకు ఎలాంటి నష్టం జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. తడిసిన జొన్నలను కూడా కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను కోరారు.రైతుల కష్టాలను ప్రభుత్వం గుర్తించి అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని, నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డిమాండ్ చేశారు. రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు జీసీసీ మేనేజర్ ఇస్తారి, ఏవో శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సుధాకర్, సీనియర్ నాయకులు కెమ శ్రీకాంత్, మండల కన్వీనర్ నాగయ్య,స్థానిక సర్పంచ్ రవి, మాజీ సర్పంచ్ లింబాజి,కల్పప్, ప్రవీణ్, గోవర్ధన్, కపిల్, రాథోడ్ ఉత్తమ్, దినేష్, అనిల్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రజల యొక్క.. ప్రజల చేత.. ప్రజల కొరకు : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ మే 30, 2026: ప్రజల యొక్క – ప్రజల చేత – ప్రజల కొరకు ఏర్పడిన ప్రజాస్వామ్యం మన దేశంలో కొనసాగుతూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాక్ పార్లమెంట్ నిర్వహణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, ఇతర శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈహొహొసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా రాజ్యాధికారాన్ని చేపట్టే వారిని ఎన్నుకునే శక్తివంతమైన ఓటు హక్కు ప్రజలకు కల్పించబడిందని తెలిపారు. రాజ్యాంగం దేశాల వారీగా వివిధ రకాలుగా ఉంటుందని, మన దేశంలో అమలులో ఉన్న రాజ్యాంగం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం కలిగి ఉన్నామని తెలిపారు. శాసన సభ, పార్లమెంట్, సర్పంచ్, మండల పరిషత్, జిల్లా పరిషత్, స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా ప్రజాప్రతినిధులను ఎన్నుకునే స్వేచ్ఛ కలిగి ఉన్నామని, రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘాల ఆధ్వర్యంలో ఎన్నికలను నిర్వహించడం జరుగుతుందని, సరైన నాయకులను ఎన్నుకునేహొహొస్వేచ్ఛ, హక్కు ప్రతి ఓటరుకు ఉంటుందని తెలిపారు. ఎన్నికలలో ప్రజలకు కల్పించిన ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికలలో గెలుపొందిన ప్రజా ప్రతినిధులు ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాలని తెలిపారు. ప్రజలకు కల్పించిన హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రతి ఒక్కరు చదువుకోవాలని తెలిపారు. విద్య అనేది ఉద్యోగం కోసం మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి అంశాన్ని తెలుసుకోవాలని, జ్ఞానం సంపాదించుకోవాలని, హక్కులు, చట్టాలు తెలుసుకోవాలని, విద్యార్థిని, విద్యార్థులు ఆత్మ రక్షణ విద్య నేర్చుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులు వారి పిల్లల కోసం పడుతున్న కష్టాలు తెలుసుకోవాలని, ఏకాగ్రత, పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. మహిళల రక్షణ, పోషణ, స్వావలంబన, సంక్షేమం కోసం ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. దేశంలో అనేక రకాల మతాలు, కులాలు, విభిన్న సంస్కృతులు ఉన్నప్పటికీ అందరం కలిసి జీవిస్తున్నామని, మనది యువ భారత దేశమని, దేశ భవిష్యత్తు యువతదేనని అన్నారు. భౌగోళికంగా, ఆర్థికంగా మన దేశం పటిష్టంగా ఉందని, దేశ భవిష్యత్తులో విద్య అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉందని తెలిపారు. అక్షరాస్యతలో మంచిర్యాల జిల్లాలో ముందంజలో ఉంచాలని, జిల్లా ప్రజల సంక్షేమం కోసం అధికార యంత్రం సమన్వయంతో కృషి చేస్తున్నామని తెలిపారు.

# ఎదగాలనే సంకల్పం ఉంటే మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారు : జిల్లా కలెక్టర్ రాజర్షిషా





సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం, రాష్ట్రం ప్రగతి సాధిస్తాయని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో గ్రామీణాభివృద్ధి – సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కిశోర బాలికల "యువతుల మాక్ పార్లమెంట్" స్నేహ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనాభాలో 50 శాతంగా ఉన్న మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం, రాష్ట్రం ప్రగతి సాధిస్తాయని, తెలంగాణ రైజింగ్ 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనే సంకల్పంలో మహిళల పాత్ర కీలకమైనదన్నారు. కిశోర బాలికలు మొబైల్ ఫోన్లు, ప్రేమ వ్యవహారాలు వంటి ఆకర్షణలకు, అలాగే బాల్య వివాహాల వంటి సామాజిక రుగ్మతలకు దూరంగా ఉంటూ, తమ జీవితంలో ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలని పిలుపునిచ్చారు. 9వ తరగతి నుండి 12వ తరగతి వరకు విద్యార్థుల జీవితంలో చాలా కీలకమైన సమయమని, ఈ దశలో బేసిక్స్ పై పట్టు సాధిస్తే సివిల్ సర్వీసెస్, గ్రూప్స్, నీట్, జేఈఈ వంటి పోటీ పరీక్షల్లో సులువుగా విజయం సాధించవచ్చని తెలిపారు. కోచింగ్ కోసం భారీగా ఖర్చు చేయనవసరం లేకుండా ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా వంటి ఆన్‌లైన్ వేదికలను ఉచితంగా, తక్కువ ఖర్చుతో సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. జిల్లాలోని కేజీబీవీలలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని, విద్యార్థులలో ఖగోళ శాస్త్రంపై ఆసక్తిని పెంచేందుకు టెలిస్కోపులను, స్పేస్, ఆస్ట్రోనమీ ల్యాబ్స్ ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. బాలికల్లో మెన్‌స్ట్రువల్ హైజీన్ పై అవగాహన పెంచడం కోసం పాఠశాలల్లో ఉచితంగా శానిటరీ ప్యాడ్స్ అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో గర్భిణీ స్త్రీలు ప్రసవాల విషయంలో మూఢనమ్మకాలను నమ్మి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, సైన్స్‌ను నమ్మి సకాలంలో ఆసుపత్రులలో సురక్షిత ప్రసవాలు చేయించుకోవాలని, దీనిపై స్నేహ గ్రూపులు అవగాహన కల్పించాలని కోరారు. స్నేహ గ్రూప్ బాలికలు స్పీకర్, డెప్యూటీ స్పీకర్, అధికార, ప్రతిపక్ష పాత్రల్లో ఎంతో క్రమశిక్షణతో పార్లమెంట్ నిర్వహణ తీరును, సమస్యల ప్రస్తావనను ప్రదర్శించిన తీరును కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా అమ్మకు అక్షర మాల సర్టిఫికెట్ లను కలెక్టర్ అందజేసి, విద్యాబోధన మెరుగుకు కృషి చేసినందుకు ఆదిలాబాదు గ్రామీణ మండలం మత్తడిగూడాకు చెందిన అంగన్వాడీ టీచర్ మయూరిని, పలువురు మహిళలను శాలువాతో సన్మానించి, అమ్మ మాట–అంగన్వాడీ బాట సెల్ఫీ పాయింట్ వద్ద అవానీతులతో కలిసి ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్.రాజేశ్వర్, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జెడ్పీ సీఈఓ రవి, డీడబ్ల్యూఓ మిల్కా, డీఆర్డీఓ రవీందర్ రాథోడ్, డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, సెర్ప్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, స్నేహ గ్రూప్ ప్రతినిధులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో హెచ్చరిక బోర్డులను వేయించాలి: ఏఐఎస్ఎఫ్

### ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు కి వినతి

అమృత్ తెలంగాణ మోత్కూర్ మండలానికి సంబంధించిన గ్రామాలలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించాలని కోరుతూ.. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావుకి అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా కౌన్సిల్ పక్షాన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ మాట్లాడుతూ.. వలిగొండ నుండి తిరుమలగిరి ప్రధాన హైవే రోడ్లో మోత్కూరు మండలానికి సంబంధించిన పలు గ్రామాలు అంటే పాలడుగు దత్తప్పగూడెం అనాజిపురం పాటిమట్ల మెయిన్ రోడ్ లో ట్రాన్స్పోర్ట్, గూడ్స్ లారీలు, హెవీ వెహికల్స్ రావడం వలన గ్రామాల్లో ఉన్నటువంటి వ్యక్తులు రోడ్డు క్రాస్ చేసే క్రమంలో హైవే రోడ్డు కావడం వలన వచ్చేటువంటి వెహికల్స్ స్పీడ్ లో రావడం జరుగుతుంది. అటువంటి గ్రామంలో ప్రజలు, గ్రామస్తులు యాక్సిడెంట్లకు గురవుతూ ప్రాణాలు కోల్పోవడం జరుగుతుంది కావున పాలడుగు దత్తప్పగూడెం, అనాజిపురం, పాటిమట్ల, గ్రామాల్లో హెచ్చరిక బోర్డు నాటి ప్రజలను అప్రమత్తం చేయగలరని విజ్ఞప్తి చేస్తున్నామని, మోత్కూర్ నుండి రాయగిరి రోడ్లో రాజన్న గూడెం గ్రామంలో రోడ్డు రిపేర్ ఉన్నందున వచ్చేటువంటి వెహికల్స్ బైక్ పై నుండి కింద పడడం జరుగుతుంది. కావున ఇట్టి విషయాలపై అతి తొందర్లో స్పందించి సంబంధిత అధికారులకు పంపి ప్రజలకు ఇబ్బందులకు గురికాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జిట్టా గౌతమ్, కర్ణాకర్, రమేష్, కర్ణాకర్ లు పాల్గొన్నారు

## మా జీవితాన్ని అందంగా తీర్చిదిద్దడానికి మీ యవ్వనాన్ని అంకితం చేసిన నాన్నకు... ప్రేమతో, కృతజ్ఞతతో."

## Happy Retirement Nanna!



అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ వృత్తిలో రాణిస్తూ ప్రకృతి మెరిపిస్తూ నేడు ఉద్యోగ విరమణ పొందుతున్న ఆదిలాబాద్ మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ సుదర్శన్ విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన మండల్లులు పొంది నేడు 31 5 2026 ఉద్యోగుల విరమణ పొందుతున్న సుదర్శన్ మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని చైర్మన్ మున్సిపల్ అధికారులు మరియు కౌన్సిలర్ తెలిపారు వృత్తిని పట్ల ప్రకృతిని మెర్పించారని కొందరు ఆదిలాబాద్ ప్రజలు తెలిపారు

**మా నాన్నకు...**

**30 సంవత్సరాల క్రితం ఒక ఉద్యోగిగా ప్రారంభమైన మీ ప్రయాణం, ఈ రోజు గౌరవప్రదమైన పదవీ విరమణతో ఒక అందమైన అధ్యాయంగా నిలిచింది.**

**నాన్నా...**

**మాకు మీరు కేవలం జూనియర్ అసిస్టెంట్ కాదు. మా బలం, మా ధైర్యం, మా జీవితానికి దారి చూపిన వ్యక్తి.**

**ఎన్నో ఉదయాలు కుటుంబం కోసం తొందరగా బయలుదేరారు...**

**ఎన్నో సాయంత్రాలు అలసిపోయి ఇంటికి వచ్చినా, మా ముఖంలో చిరునవ్వు చూడటానికే జీవించారు...**

**మీ కష్టం మాకు సౌకర్యాలను ఇచ్చింది.**

**మీ త్యాగం మాకు మంచి భవిష్యత్తును ఇచ్చింది.**

**మీ విలువలు మాకు జీవితాన్ని నేర్పించాయి.**

**మీరు చేసిన ప్రతి త్యాగానికి, ప్రతి ప్రేమకు, ప్రతి చిరునవ్వుకు ధన్యవాదాలు నాన్నా...**

**మీరు ఆరోగ్యంగా, ఆనందంగా, ప్రశాంతంగా ఉండాలని కోరుకుంటూ...**

## ప్రేమతో మీ కుమారులు కుమార్తె

*Mr.&Mrs Uday Raj - Priya*

*"Mr.&Mrs Rajendra prasad - Udaya Sudha*

*"Mr.&Mrs Charan raj - Snehitha*

## ప్లాన్ మార్చిన బేబమ్మ..!




బాలీవుడ్ తర్వాత అంత పెద్ద స్థాయిలో సినిమాలు తీస్తే పరిశ్రమ అంటే అనరు టాలీవుడ్ గురించే చెబుతారు. ఈమధ్య మన సినిమాలు బాలీవుడ్ లో కూడా టాప్ లేపేలా రికార్డులు సృష్టిస్తున్నాయి. అందుకే ఇక్కడ క్రేజ్ తెచ్చుకోవాలని హీరోయిన్స్ కూడా అనుకుంటారు. టాలీవుడ్ లో హీరోయిన్ గా క్లిక్ అయితే చాలు ఒక్క సినిమా హిట్ అయితే పది సినిమాల ఆఫర్లు ఒకేసారి వచ్చేస్తాయి. ఈ క్రమంలోనే ఉప్పెన సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది బెంగుళూరు భామ కృతి శెట్టి. ఆ సినిమాలో బేబమ్మ పాత్రలో కృతి శెట్టి చూపించిన అభినయం ప్రేక్షకులను ఇంప్రెస్ చేసిని. మొదటి సినిమాకే స్టార్ క్రేజ్ తెచ్చుకున్న జాబితాలో కృతి శెట్టిని చేర్చింది. ఉప్పెన హిట్ తో అరడజనుకు పైగా సినిమాలు చేస్తూ వచ్చింది కృతి శెట్టి. ఉప్పెన తర్వాత నానితో శ్యామ్ సింగ రాయ్ సినిమా చేసిన కృతి శెట్టి ఆ మూవీతో కూడా హిట్ అందుకోగా నెక్స్ట్ వచ్చిన బంగార్రాజు కూడా సక్సెస్ అయ్యింది. హ్యాట్రిక్ హిట్స్ తో కృతి శెట్టి రేంజ్ పెరగ్గా తర్వాత వచ్చిన 3 సినిమాలు ఫ్లాప్ అయ్యి అమ్మడికి షాక్ ఇచ్చాయి. బంగార్రాజు తర్వాత రామ్ తో ది వారియర్ నితిన్ మాచర్ల నియోజకవర్గం సుధీర్ బాబు ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి సినిమా చేసింది. ఈ సినిమాలన్ని బాక్సాఫీస్ దగ్గర ఫెయిల్ అయ్యాయి. హ్యాట్రిక్ హిట్ హ్యాట్రిక్ ఫ్లాప్ లతో కెరియర్ రిస్క్ లో పడ్డ బేబమ్మ వచ్చిన ప్రతి ఛాన్స్ చేయకూడదు అని ఇప్పుడు జ్ఞానోదయమైంది. ఉప్పెన క్రేజ్ తో వచ్చినా సినిమా ప్రతి ఒక్కటి సైన్ చేసుకుంటూ వెళ్తే ఇలానే జరుగుతుంది. అందుకే కృతి శెట్టి సినిమాలకు కొద్దిగా టైం తీసుకోవాలని అనుకుంటుంది. ప్రస్తుతం కృతి శెట్టి నాగ చైతన్యతో వెంకట్ ప్రభు మూవీలో జోడీ కడుతుంది. ఈ మూవీతో పాటుగా మళయాళంలో కూడా కొత్త మూవీ చేస్తుంది. ఎన్ని సినిమాలు చేశామన్నది కాదు ఎన్ని సినిమాలతో ప్రేక్షకులు మనసులు గెలిచామన్నది

## అవ్నీత్ కౌర్.. పర్ఫెక్ట్ బోల్డ్ అటెంప్ట్..!



బాలీవుడ్ మోడల్ కమ్ యాక్ట్రెస్ అవ్నీత్ కౌర్ మాములుగానే తన ఫోటో షూట్స్ తో ఓ రేంజ్ లో రెచ్చిపోతుంది. బాలీవుడ్ లో మ్యూజిక్ వీడియోస్ తో తనకంటూ ఒక సెపరేట్ బ్రాండ్ ఏర్పరచుకున్న అవ్నీత్ కౌర్ హిందీ ఆల్బంస్ కి ఆమె ఓ సూపర్ స్టార్ గా మారింది. ప్రత్యేకంగా ఆమె చేస్తున్న మ్యూజిక్ వీడియోస్ కి స్పెషల్ ఫ్యాన్స్ ఉన్నారు. చేసేది మ్యూజిక్ వీడియోస్ లానే అనిపించినా ఓ చిన్నపాటి సినిమా సెటప్ ఉంటుంది. అందుకే అమ్మడు వాటితోనే సూపర్ పాపులర్ అయ్యింది. అవ్నీత్ కౌర్ గ్లామర్ ట్రీట్ కి బీ టౌన్ ఆడియన్స్ ఫిదా అవుతున్నారు. లేటెస్ట్ గా అవీత్ కౌర్ తన క్రేజీ ఫోటో షూట్స్ తో సోషల్ మీడియాని షేక్ చేస్తుంది. స్లీవ్ లెస్ జాకెట్.. షార్ట్ తో అమ్మడు రచ్చ అంతా ఇంతా కాదు. కేవలం మ్యూజిక్ వీడియోస్ మాత్రమే కాదు అవ్నీత్ సినిమాలు టీవీ షోస్ లో కూడా నటించింది. తన గ్లామర్ తో బీ టౌన్ ఆడియన్స్ ని తన మాయలో పడేయాలని చూస్తున్న అవ్నీత్ తన దాకా వచ్చిన ఏ ఛాన్స్ ని కూడా వదలట్లేదు. మ్యూజిక్ వీడియోస్ కి ఆమె ప్రత్యేక ఆకర్షణ అవుతుంది. వీడియో సాంగ్స్ తో స్టార్ క్రేజ్ తెచ్చుకున్న వారిలో అవ్నీత్ కౌర్ ఉంటుంది. ఛాన్స్ దొరికితే చాలు సోషల్ మీడియాలో తన ఫోటో షూట్స్ తో కుర్రాళ్ల హృదయాల్లో గిలిగింతలు పెట్టేస్తుంది అవ్నీత్ కౌర్. ఫోటో షూట్ లో బోల్డ్ షో చేస్తూ మైండ్ బ్లాక్ అయ్యేలా చేస్తున్న అమ్మడి అందాలకు ఫిదా అవ్వని వారెవరైనా ఉంటారా చెప్పండి. తనకు వచ్చిన ఈ పాపులారిటీని ప్రతి నిమిషం ఎంజాయ్ చేస్తూ తన క్రేజ్ ని మరింతగా పెంచుకోవాలని తెగ కష్టపడుతుంది అవ్నీత్ కౌర్. అయితే లేటెస్ట్ ఫోటోలైతే మాత్రం ఓ రేంజ్ లో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా షార్ట్ ధరించిన అమ్మడి థైస్ షోస్ చూసి అందరు ముక్కున వేలేసుకుంటున్నారు. తన ఇన్ స్టాగ్రాం లో బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ రేంజ్ లో 32.8 మిలియన్ ఫాలోవర్స్ తో హంగామా చేస్తుంది అవ్నీత్ కౌర్. ఆమె స్టార్ స్టేటస్ ఏంటన్నది చెప్పడానికి ఈ ఫాలోవర్స్ ఒక ఎక్సాంపుల్ అని చెప్పొచ్చు. అవ్నీత్ ప్రస్తుతం మరో మ్యూజిక్ వీడియో చేస్తుంది. లేటెస్ట్ ఫోటో షూట్ కూడా అదేదో పబ్ బ్యాక్ డ్రాప్ ఉన్నట్టుగ ఔంది. అందుకే కలర్ ఫుల్ లైట్స్ తో కలర్ ఫుల్ గా కనిపించింది అమ్మడు. ఏది ఏమైనా అవ్నీత్ అందాల తాకిడికి బీ టౌన్ ప్రేక్షకులు పిచ్చోళ్లవుతున్నారంటే నమ్మాల్సిందే.


## కొత్త బ్యూటీని దించబోతున్న నందమూరి హీరో



నందమూరి కళ్యాణ్ రామ్ హీరోగా రాజేంద్ర రెడ్డి దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ వారు నిర్మిస్తున్న అమిగోస్ సినిమా ఇటీవలే ఫస్ట్ లుక్ వచ్చి అందరి దృష్టిని ఆకర్షించిన విషయం తెల్సిందే. ఈ సినిమా టైటిల్ తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్ చాలా విభిన్నంగా ఉండటం వల్ల సినిమా గురించిన చర్చ ఒక వర్గం ప్రేక్షకుల్లో జరుగుతోంది. ఇక కళ్యాణ్ రామ్ గత చిత్రం బింబిసార సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడం తో పాటు మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ లో ఈ సినిమా రూపొందుతున్న కారణంగా అమిగోస్ పై అంచనాలు ఫ్యాన్స్ తో పాటు ప్రేక్షకుల్లో కూడా బాగానే ఉన్నాయి.. విడుదల సమయంకు ఆ అంచనాలు పెరిగే అవకాశాలు కూడా లేకపోలేదు అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కళ్యాణ్ రామ్ కు జోడీగా ఈ సినిమా లో కన్నడ బ్యూటీ ఆషిక రంగనాథ్ నటించబోతున్నట్లుగా సమాచారం అందుతోంది. ఈ కన్నడ బ్యూటీ ఇప్పటికే కన్నడం లో దాదాపుగా పది సినిమాలు చేసినట్లుగా సమాచారం అందుతోంది. త్వరలోనే తెలుగు లో ఈ అమ్మడు కళ్యాణ్ రామ్ కు జోడీగా నటించడం ద్వారా ఎంట్రీ ఇవ్వబోతుంది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లుగా ఈ అమ్మడు అందం మరియు ఫిజిక్ ఉంటుందని.. అందుకే తెలుగు లో ఈ అమ్మడు తప్పకుండా స్టార్ హీరోయిన్ గా పేరు దక్కించుకుంటుందనే నమ్మకంను మైత్రి మూవీ మేకర్స్ వారు వ్యక్తం చేస్తున్నారు. అమిగోస్ సినిమా లో కళ్యాణ్ రామ్ మూడు విభిన్నమైన పాత్రల్లో కనిపించబోతున్న విషయం తెల్సిందే. మరి మూడు పాత్రలకు ముగ్గురు హీరోయిన్స్ ఉంటారా లేదంటే ఈ ఒక్క కన్నడ బ్యూటీతోనే అమిగోస్ సినిమాను నడిపిస్తారా అనేది చూడాలి.




## కృతజ్ఞత లేదంటూ స్టార్ హీరోయిన్ పై ట్రోల్స్..!



'కిరిక్ పార్టీ' అనే కన్నడ సినిమాతో హీరయిన్ గా పరిచయమైన లక్కీ బ్యూటీ రష్మిక మందన్నా.. ఛలో చిత్రంతో టాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చింది. వరుస విజయాలతో ఛలోమంటూ దూసుకెళ్లిన ఈ భామ.. అనతి కాలంలోనే స్టార్ స్టేటస్ అందుకుంది. పుష్ప సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. ఈ క్రమంలో బాలీవుడ్ లో అడుగుపెట్టి ఫుల్ బిజీగా మారిపోయింది. రష్మిక ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణాన్ని గుర్తు చేసుకుంది. తన తొలి చిత్రం 'కిరిక్ పార్టీ' లో హీరోయిన్ గా అవకాశం ఎలా వచ్చిందో ఆమె వివరించింది. కాలేజీలో చదువుతున్నప్పుడు తాను కొంత మోడలింగ్ చేశానని.. టైమ్స్ ఆఫ్ ఇండియా మొదటి పేజీలో తన ఫోటో ఒకటి ప్రచురితమైందని చెప్పింది. అది చూసి ప్రొడక్షన్ హౌస్ నుండి ఫోన్ చేసి సినిమా ఆఫర్ చేశారని.. అలా ఫస్ట్ ఛాన్స్ వచ్చిందని తెలిపింది. అయితే ఇక్కడ రష్మిక తనకు తొలి అవకాశం ఇచ్చిన బ్యానర్ పేరు కూడా ప్రస్తావించలేదు. కిరిక్ పార్టీ చిత్రం ఆమె మాజీ ప్రియుడు రక్షిత్ శెట్టి స్వీయ నిర్మాణంలో.. అతని సోదరుడు కాంతారా ఫేం రిషబ్ శెట్టి దర్శకత్వంలో తెరకెక్కింది. అయితే వాళ్ళిద్దరి పేర్లను నేషనల్ క్రష్ ప్రస్తావించకపోవడాన్ని సోషల్ మీడియాలో తప్పుబడుతున్నారు. రష్మిక ఇప్పుడు ఎలాంటి పొజిషన్ లో వున్నా ఆమె తన మూలాలను మరచిపోకూడదని.. అవకాశం ఇచ్చిన వారి పట్ల కృతజ్ఞతాభావం కలిగి ఉండాలని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఆమెకు కృతజ్ఞత లేదని ట్రోల్ చేస్తున్నారు. ఈ నేథ్యంలోనే రష్మిక ఇన్స్టాగ్రామ్ లో సుదీర్ఘమైన ఎమోషనల్ పోస్ట్ పెట్టింది. కెరీర్ ప్రారంభం నుంచి కొంతమంది నెటిజన్ల నుంచి ఎదురైన నెగెటివ్ కామెంట్స్ ట్రోలింగ్స్ గురించి రాసుకొచ్చింది. తన కెరీర్ ప్రారంభించినప్పటి నుండి చాలా ద్వేషానికి గురవుతున్నానని.. చాలా ట్రోల్లు మరియు ప్రతికూలత ఎదుర్కొన్నానని పేర్కొంది. గత కొన్ని రోజులు వారాలు నెలలు సంవత్సరాల నుంచి కొన్ని విషయాలు నాకు చిక్కులు తెచ్చిపెడుతున్నాయి. ఆ విషయం గురించి మాట్లాడేందుకు ఇదే సరైన సమయం అనుకుంటున్నా. నేను నా కోసం మాత్రమే మాట్లాడుతున్నాను.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- sigidiamruth404@gmail.com